ఆకురాల్చే చెట్లతోనే తరచూ మంటలు

- ఎక్కడ మంటలంటుకున్నా శాటిలైట్ ద్వారా సమాచారం
- హుటాహుటిన వెళ్లి ఆర్పేస్తున్న అటవీ అధికారులు

7లో




మరో రెండు రోజులే గడువు

ఓటరు నమోదుకు చివరి అవకాశం

మెదక్, ఏప్రిల్ 13 : ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు మరో రెండు రోజుల గడువు ఉన్నది. 15 వరకు దరఖాస్తుకు తుది గడువుగా ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 8న ఎన్నికల అధికారులు ఓటర్ల జాబితాను ప్రకటించారు. తుది ఓటరు జాబితాను ఈ నెల 25న ప్రకటించనున్నారు. నూతన ఓటర్ల నమోదుకు ఇదే చివరి అవకాశం. ఫిబ్రవరి నుంచి కొనసాగుతున్న ఓటరు నమోదు ద్వారా ఇప్పటికే జిల్లా ఎన్నికల యంత్రాంగానికి ఫాం-6 దరఖాస్తులు భారీగానే వచ్చాయి. తుదిగడువు వరకు ఆన్‌లైన్‌లోగానీ, ఆఫ్‌లైన్‌లో గానీ దరఖాస్తులను స్వీకరించి, అనంతరం వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు.

2006 మార్చి 31 తేదీలోపు జన్మించిన వారు తమ ఓటు హక్కును పొందువచ్చు. ఓటరుగా తమ పేరు నమోదు చేయించుకునేందుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ధ్రువీకరణ పత్రాల నకలు, పాస్‌ఫొటో జతపర్చి సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్(బీఎల్‌వో)కు అందజేయాల్సి ఉంటుంది. ఓటరు జాబితాలో పేరు గల్లంతైనవారు, ఓటుహక్కుకు నోచుకోలేని వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటరు జాబితాలో తమ పేరు ఉన్నప్పటికీ, ఇతర ప్రాంతానికి వెళ్లిన వారు తమ నివాస ప్రాంతానికి ఓటు మార్చుకోవడానికి ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఫారం ద్వారా పోలింగ్ కేంద్రం మార్పు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. 18 ఏళ్లు నిండిన వారందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల సంఘం గ్రామాల్లో, పట్టణాల్లో కళాబృందాలతో ప్రచారం చేయిస్తోంది.

విద్యాశాఖలో ఈ ఏడాది 160 మంది రిటైర్‌మెంట్!



సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 13 : విద్యాశాఖలో దశాబ్దాల పాటు సేవలందించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణకు సిద్ధమవుతున్నారు. మూడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయస్సును 58 ఏళ్ల నుంచి 61 ఏళ్లకు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అప్పట్లో ఈ నిర్ణయాన్ని కొందరు వ్యతిరేకించగా, మరి కొందరు స్వాగతించారు. దీంతో 2021 మార్చి 31 నాటికి 58 ఏళ్లు పూర్తయినా వయోపరిమితి గడువు పెంపుతో వారంతా విధుల్లో కొనసాగారు. 2024 మార్చి 31 నాటికి గడువు ముగియడంతో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల, సిబ్బంది ఈ నెల నుంచి బయటకు వచ్చేస్తున్నారు. ఏప్రిల్ నుంచి ప్రతి నెలా 61 ఏళ్ల వయోపరిమితి పూర్తి చేసుకున్న వారంతా ఉద్యోగ విరమణ పొందనున్నారు.

నెల వారీగా రిటైర్‌మెంట్లు

సంగారెడ్డి జిల్లా పాఠశాల విద్యాశాఖలో ఈ ఏడాది 160 మంది ఉద్యోగ విరమణ చేయనున్నారు. వారిలో ప్రధానోపాధ్యాయులు(జీహెచ్‌ఎం) 14 మంది, స్కూల్ అసిస్టెంట్లు, తత్సామాన క్యాడర్ 91 మంది(ఎస్‌ఏ-74, ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం-15, పీడీ-2), సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) 55 మంది ఉన్నారు. వీరంతా ఈ ఏడాది డిసెంబరు వరకు నెల వారీగా రిటైర్‌మెంట్ కానున్నారు.

బోధనపై ప్రభావం పడే అవకాశం

జిల్లాలో 551 టీచర్ల పోస్టులు ఖాళీ ఉన్నట్లు ఇటీవల విద్యాశాఖ గుర్తించగా, వాటిని మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు కసరత్తు మొదలు పెట్టిన సర్కారు.. వచ్చే విద్యాసంవత్సరం ఆరంభం నాటికి పోస్టులను భర్తీ చేస్తే తప్ప జిల్లాలో ఉపాధ్యాయుల కొరత తీరే అవకాశం లేదు. ఒకవేళ ఉపాధ్యాయుల భర్తీ ఆలస్యమైతే.. మళ్లీ విద్యా వలంటీర్లను ఈ ఏడాది విధుల్లో తీసుకోవడం లేదా ఉపాధ్యాయుల తాత్కాలిక డిప్యూటేషన్‌పై సర్దుబాటు చేసే అవకాశం ఉందని విద్యా శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయితే, ఈ ఏడాది పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేయనుండడంతో టీచర్ల కొరత ఏర్పడి బోధనపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

పరిశ్రమల స్థాపనతో నిరుద్యోగం తగ్గుదల

- సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 13 : పారిశ్రామిక వేత్తలు జిల్లాలో పెట్టుబడులు పెట్టి కొత్త పరిశ్రమలు స్థాపించాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ కోరారు. పరిశ్రమలతోనే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. సుల్తాన్‌పూర్‌లోని ఇండస్ట్రియల్ పార్కులో శనివారం పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సొసైటీ స్థాపనకు గల ముఖ్య కారణాలను వివరిస్తూ పరిశ్రమల్లో తరచూ చోటు చేసుకుంటున్న వివిధ రకాల ప్రమాదాలు, పరిశ్రమల్లో ఉండాల్సిన భద్రతాపరమైన చర్యల గురించి వివరించారు. అలాగే పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు రక్షణ, యువతకు అందించాల్సిన ఉపాధిపై పారిశ్రామిక వేత్తలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు, పారిశ్రామికవేత్తలు, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐలు ప్రవీణ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గంగాధర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్ పటాన్‌చెరు

- అభ్యర్థుల మూలాలు ఇక్కడే..
- ఎంపీ ఎన్నికల్లో కీలకంగా పారిశ్రామిక ఓటర్లు
- నాలుగు లక్షల ఓటర్లతో అతిపెద్ద నియోజకవర్గం
- ఓటర్లు మొగ్గు ఎటువైపో ఆసక్తికరం
- పావులు కదుపుతున్న ప్రధాన పార్టీలు
- గంపగుత్త ఓట్ల కోసం కసరత్తు

ముగ్గురు అభ్యర్థులకు అనుబంధం..

పార్లమెంట్ బరిలో బీజేపీ అభ్యర్థిగా దుబ్బాక మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు, బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ, మాజీ కలెక్టర్ వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా చిట్కుల్ మాజీ సర్పంచ్ నీలం మధు నిలిచారు. ఈ ముగ్గురికి పటాన్‌చెరు ప్రాంత నేపథ్యం ఉండటం వల్ల ఇక్కడ ఓటర్లు ఎటు వైపు మొగ్గు చూపుతారన్నది ఆసక్తిగా మారింది. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు రాజకీయ ప్రస్థానం పటాన్‌చెరు నుంచే ప్రారంభమైంది. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన పటాన్‌చెరు నుంచే రాజకీయాలు కొనసాగించారు. న్యాయవాదిగా, పాత్రికేయుడిగా ఆయనకు స్థానికంగా పరిచయాలు ఉన్నాయి. ఇక కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు స్వగ్రామం చిట్కుల్ ఇక్కడే ఉండటం, సర్పంచ్‌గా పనిచేయడమే కాకుండా గత అసెంబ్లీ ఎన్నిల్లో బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసి 40 వేలకు పైచిలుకు ఓట్లు సాధించారు. మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డి సైతం గతంలో సంగారెడ్డి జాయింట్ కలెక్టర్‌గా పనిచేయడంతో పాటు ప్రస్తుతం ఆయన నియోజకవర్గ పరిధిలోని తెల్లాపూర్‌లోనే స్థిర నివాసం ఏర్పరచుకున్నారు.



పటాన్‌చెరు, ఏప్రిల్ 13 : మెదక్ పార్లమెంట్ పరిధిలో గెలుపు కోసం ప్రధాన పార్టీలకు పటాన్‌చెరు అసెంబ్లీ సెగ్మెంట్ టార్గెట్‌గా మారింది. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పటాన్‌చెరు, సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. నియోజకవర్గాల్లోనే అత్యధికంగా పటాన్‌చెరులోనే నాలుగు లక్షలపైచిలుకు ఓటర్లు ఉన్నారు పటాన్‌చెరు ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపితే వారినే విజయం వరించడం గ్యారంటీగా కనిపిస్తోంది. దీంతో ఇక్కడి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు మూడు పార్టీలు పావులు కదుపుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులే రంగంలోకి దిగి నేరుగా ఓటర్ల వద్దకు వెళ్లి ప్రచారం చేయడం సాధ్యం కాదు. ఓటర్ల సాంద్రత ఎక్కువగా ఉండే కాలనీలు, అపార్ట్‌మెంట్‌ల పరిధిలో తక్కువ సమయంలో ఎక్కువ ఓటర్లను కలుసుకునే అవకాశం ఉన్నందున నాయకులు ఈ ప్రాంతంలోనే విస్తృత ప్రచారం చేయడంపై దృష్టి పెట్టారు. గంపగుత్తగా ఓట్ల కోసం కసరత్తు చేస్తున్నారు.

గణనీయంగా పెరుగుతున్న ఓటర్లు

పటాన్‌చెరు నియోజకవర్గంలో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వలస వచ్చి స్థిర నివాసం ఏర్పరచుకున్న వారు గణనీయమైన సంఖ్యలోనే ఉన్నారు. దశాబ్దకాలంలో పటాన్‌చెరు, తెల్లాపూర్, అమీన్‌పూర్, ఇస్నాపూర్, రుద్రారం, జిన్నారం, గుమ్మడిదల ప్రాంతాలు వేగంగా విస్తరించాయి. కొత్త కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లు రావడంతో కొత్త ఓటర్లు పెరిగారు. ఎప్పుడు ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టినా వేలాది కొత్త ఓటర్లు నమోదు చేసుకుంటున్నారు. తాజాగా జనవరిలో విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం 4,10,179 మంది ఓటర్లు నమోదు కాగా తుది ఓటరు జాబితా విడుదల నాటికి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

కార్మికులు, ఉద్యోగులే ఎక్కువ

నియోజకవర్గంలో సుమారు రెండు వేల చిన్న, మధ్య, భారీ పరిశ్రమలతో పాటు బీహెచ్‌ఈఎల్, ఇక్రిశాట్, బీడీఎల్ తదితర భారీ సంస్థలు ఉన్నాయి. అనేక బహుళజాతి పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. నియోజకవర్గంలోని పటాన్‌చెరు, పాషమైలారం, ఐడీఏ బొల్లారం, ఆశోక్‌నగర్, ఇస్నాపూర్, బొంతపల్లి, ఖాజిపల్లి, గడ్డపోతారం పారిశ్రామికవాడల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఇక సాఫ్ట్‌వేర్ సంస్థలకు కేంద్రబిందువైన మాదాపూర్, గచ్చిబౌలి, ఫైనాన్సియల్ జిల్లాలు పక్కనే ఉండటంతో వేలాది మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అమీన్‌పూర్, తెల్లాపూర్ ప్రాంతంలో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. పరిశ్రమల్లో, సాఫ్ట్‌వేర్ సంస్థల్లో పనిచేసేందుకు దేశం నలుమూలల నుంచి వచ్చి స్థిరపడిన కుటుంబాలు ఉన్నాయి. యూపీ, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిషా, కర్ణాటకతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి జిల్లా నుంచి వలసలు వచ్చిన విభిన్నమైన ఓటర్లు స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. మినీ ఇండియా స్వరూపం ఉన్న పటాన్‌చెరు ఓటర్లు పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపును మలుపు తిప్పే అవకాశం ఉంది. దీంతో మినీఇండియా ఓటరును ఆకట్టుకునేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు తమదైన ప్రయత్నాలు చేస్తున్నారు.

చల్లబడిన వాతావరణం

- సంగారెడ్డి, మెదక్ జిల్లాలో వర్షం
- కొన్ని ప్రాంతాల్లో మోస్తరుగా.. మరికొన్ని చోట్ల చిరుజల్లులు
- ఆకాశం మేఘావృతం కావడంతో పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఎండల నుంచి ఉపశమనం పొందిన ప్రజలు

మెదక్ అర్బన్/సంగారెడ్డి అర్బన్/నారాయణఖేడ్/కంగ్టి/కల్హేర్/మనూరు, ఏప్రిల్ 13 : ఈనెల ప్రారంభం నుంచి భగభగ మండుతూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసిన భానుడు తన ప్రతాపాన్ని కాస్త తగ్గించాడు. వారం రోజుల కిందటి వరకు పగటి ఉష్ణోగ్రతలు 43.9 డిగ్రీల వరకు నమోదు కావడంతో వేడికి తాళలేక వృద్ధులు, చిన్నారులు అల్లాడిపోయారు. ఉక్కపోత, వడగాల్పుల కారణంగా బయటకు వచ్చేందుకు జంకారు. కానీ, రెండు రోజుల నుంచి భానుడు శాంతించాడు. శుక్రవారం సాయంత్రం నుంచి వాతావరణం చల్లబడింది. శనివారం రోజంతా ఆకాశం మేఘావృతం కావడంతో పగటి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉదయం నుంచి మెదక్, సంగారెడ్డి జిల్లాలో పలు చోట్ల చిరుజల్లులు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం పడింది. దాంతో పాటు చల్లనిగాల్పులు వీయడంతో ప్రజలు ఉపశమనం పొందారు. అయితే, పలుచోట్ల వరి కోతలు కొనసాగుతున్నాయి. కోసిన ధాన్యం పొలాల్లోనే ఉండడంతో నష్టం ఏమైనా జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కల్లాల్లో ధాన్యం ఆరబెట్టిన రైతులకు భయం పట్టుకున్నది.

కంగ్టిలో అత్యధికంగా 64.5 మిల్లీమీటర్ల వర్షపాతం


సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలో శుక్రవారం రాత్రి అత్యధికంగా 64.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. శనివారం ఉదయం ఓ మోస్తారుగా వాన పడింది. నారాయణఖేడ్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు మోస్తరు వర్షం కురిసింది. శనివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కురియడంతో చేతికి అందే దశలో ఉన్న మామిడికాయలు నేలకు రాలాయి. మనూరు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి గంటపాటు వర్షం కురిసింది. వర్షం వలన చేతికందే వరి, జొన్న పంటలకు, మామిడి తోటలకు నష్టం జరిగింది. కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో శుక్రవారం సాయంత్రం నుంచి గాలిదుమారంతో కూడిన కొద్దిపాటి వర్షం కురియడంతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. మహాదేవ్‌పల్లి గ్రామ శివారులో రహదారిపై ఆరబెట్టిన ధాన్యం తడిసి కొట్టుకుపోయింది. వర్షం ధాటికి ధాన్యంపై టార్పాలిన్లను కప్పారు. మనూరులో 42.5 మిల్లీమీటర్లు, నాగల్‌గిద్దలో 32.8, సిర్గాపూర్‌లో 8.8, నారాయణఖేడ్‌లో 6.6, నిజాంపేటలో 5.3, కల్హేర్‌లో 2.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అయితే పటాన్‌చెరు, రామచంద్రాపురం, చౌటకూరు మండలాల్లో వర్షం కురియలేదు.



కల్హేర్ మండలంలోని మహాదేవ్‌పల్లి శివారులో తడిసిన ధాన్యం

మెదక్ జిల్లా వ్యాప్తంగా..

మెదక్ జిల్లా వ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో అత్యధికంగా పెద్దశంకరంపేటలో 33.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రేగోడ్ 26.0, బోడాగాట్ 11.0, అల్లాదుర్గం 8.0, లింగాయిపల్లి 7.3, మిన్పూర్ 6.0, నాగాపూర్ 4.8, వాడీ 3.5, పొడ్చన్‌పల్లి 2.8, మెదక్ 2.5, టేక్మాల్, కొత్తపేట, కొల్చారం, లక్ష్మాపూర్ 2.3, పాతూర్ 2.2, రామాయంపేట 2.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



డిజిటల్ హెల్త్‌కార్డు నమూనా

ఇక డిజిటల్ హెల్త్‌కార్డులు

18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఆరోగ్య కార్డులు

- జూలై నుంచి పంపిణీకి శ్రీకారం
- కసరత్తు చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 13 : డిజిటల్ హెల్త్‌కార్డులకు సర్కారు శ్రీకారం చుట్టింది. ప్రజల ఆరోగ్య స్థితిగతులపై సమగ్ర సమాచారం అందుబాటులోకి తేవడంతో పాటు ఈ-రికార్డుల ద్వారా మెరుగైన, అత్యవసర వైద్య సేవలందించేందుకు డిజిటల్ హెల్త్‌కార్డులతో వీలవుతుందని సర్కారు భావిస్తోంది. ఇందులో భాగంగా 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్‌కార్డులను అందజేయడంతో పాటు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వైద్య ఆరోగ్య శాఖ, ఐటీ విభాగం సమన్వయంతో డిజిటల్ హెల్త్‌కార్డుల రూపకల్పనపై సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. ఆధార్ కార్డు సంఖ్య తరహాలో ప్రతి పౌరుడికి స్మార్ట్‌కార్డును జారీ చేయనున్నారు. జూలై నుంచి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డులు పంపిణీ చేయాలని సర్కారు భావిస్తున్నదని వైద్య ఆరోగ్య శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

సమగ్ర ఆరోగ్య సమాచారం

డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు ద్వారా సంబంధిత వ్యక్తి ఆరోగ్యం, అనారోగ్య పరిస్థితులు, గతంలో అందించిన వైద్యం, చికిత్స, ఉపయోగిస్తున్న మందులు, సమస్య, డాక్టర్ల అభిప్రాయం, విశ్లేషణ వంటి తదితర సమగ్ర సమాచారం డిజిటల్ కార్డులో అందుబాటులో ఉండనుంది. రాష్ట్రంలో ఎక్కడ చికిత్సకు వెళ్లినా ఈ వివరాలన్నీ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్యులకు వెంటనే తెలియడంతో మెరుగైన చికిత్స, వైద్య సేవలకు అవకాశం ఉంటుంది. దీర్ఘకాలిక బాధితులను గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించడం, కేన్సర్ వంటి రోగాలను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన చికిత్స అందించే అవకాశం ఉంటుంది. ఈ కార్డును ఆరోగ్యశ్రీ, ఆధార్‌తో అనుసంధానం చేయనున్నారు.

గతంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైనా..

డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డుల రూపకల్పనలో భాగంగా రెండేళ్ల కిందట రాష్ట్రంలోని ములుగు, సిరిసిల్ల జిల్లాలను పైలెట్ ప్రాజెక్టుగా అప్పటి సర్కారు ఎంపిక చేసి పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరీ ఆరోగ్య సమాచార నివేదిక తయారు చేశారు. ఆయా జిల్లాలోని ప్రజలందరికీ హెల్త్‌కార్డులు ఇచ్చి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని సర్కారు భావించింది. కారణాలేమైనప్పటికీ హెల్త్ ప్రొఫైల్ కార్డులను పంపిణీ చేయకుండానే అర్థాంతరంగా పథకాన్ని నిలిపివేసింది. గతేడాది సంగారెడ్డి జిల్లాలోని కంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హెల్త్ ప్రొఫైల్ పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. తాజాగా రేవంత్‌రెడ్డి సర్కారు మళ్లీ డిజిటల్ హెల్త్‌కార్డులను జారీ చేస్తామని ప్రకటించింది. ఈసారైనా హెల్త్‌కార్డులను అందజేస్తే మెరుగైన వైద్యసేవలు అందుతాయి.

సమాచార సేకరణ ఇలా..

క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తారు. ఒక్కొక్కరికి ఒక్కో ఐడీ నంబరు కేటాయిస్తారు. బీపీ, షుగర్‌తో పాటు ఇతర ఆరోగ్య సమస్యలను గుర్తించి నమోదు చేస్తారు. రక్త, మూత్ర పరీక్షలు, ఎత్తు, బరువు, పొడవు, బ్లడ్ గ్రూప్, సర్జరీల వివరాలతోవ్యక్తిగత రికార్డులను రూపొందిస్తారు. ఏ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సకు వెళ్లినా ఐడీ నంబరుతో ఈ వివరాలు అందుబాటులోకి వస్తాయి. ఏ వైద్యుడిని సంప్రదించినా వారి ఆరోగ్య స్థితిగతులను వెంటనే తెలుసుకుని మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ కార్డు దోహదపడనుంది.

కాంగ్రెస్ మెడలు వంచుతాం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



పటాన్‌చెరులో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సంగారెడ్డి టౌన్/పటాన్‌చెరు, ఏప్రిల్ 13: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి అమలు చేయిస్తామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం సంగారెడ్డిలోని ఓ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ యువత సమావేశంలో, పటాన్‌చెరులో నిర్వహించిన నియోజకర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిజస్వరూపం నాలుగు నెలల్లోనే బహిర్గతమైందన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీల అమలు చేస్తామని మోసం చేశారని, ఎన్నికల ముందు పంచిన బాండ్‌పేపర్లు ఇంకా ఉన్నాయని అన్నారు. రాష్ట్రానికి పైసా ఇవ్వని బీజేపీకి ఓటువేయడం దండగన్నారు. ఓట్ల కోసం ఊర్లల్లోకి వచ్చే కాంగ్రెస్, బీజేపీ నేతలను చీపురు కట్టలతో తరిమికొట్టాలని మహిళలకు పిలుపు ఇచ్చారన్నారు. అబద్ధాలు ఆడటంలో బీజేపీ బడేబాయ్, కాంగ్రెస్ చోటే భాయ్ అని విమర్శించారు. కేసీఆర్ అలుపెరగని పోరాటంతో అమరుల త్యాగాలతో తెలంగాణ సిద్ధించిందన్నారు. తెలంగాణ రావడం వల్లే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడని, లేని పక్షంలో చంద్రబాబునాయుడు దగ్గర ఉండేవారన్నారు. రంజాన్ తోఫా నిలిపివేసిన కాంగ్రెస్‌కు మైనార్టీలు బుద్ధి చెప్పాలన్నారు. ఆయా సమావేశాల్లో ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, గూడెం మహిపాల్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, ఎంపీపీలు, నాయకులు పాల్గొన్నారు.

విద్యతోపాటు ఆత్మరక్షణలోనూ ముందుండాలి

● ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మల్లిక

వట్‌పల్లి, ఫిబ్రవరి 13: నేటి సమాజంలో జరుగుతున్న ఘటనలను ఎదుర్కొనేందుకు బాలికలు ఆత్మ రక్షణ విద్య మార్షల్ ఆర్ట్స్‌లోనూ రాణించాలని వట్‌పల్లి మండలం పోతులబొగుడ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మల్లిక అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థినులకు మార్షల్ ఆర్ట్స్ అకాడమి గ్రాండ్ మాస్టర్ పోచయ్య ఆధ్వర్యంలో సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎం శ్రీ పథకంలో భాగంగా మూడునెలలుగా విద్యార్థినులకు మార్షల్ ఆర్ట్స్‌పై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఏదైనా సంఘటనలు ఎదురైతే ఆత్మస్థైర్యంతో ఎదుర్కొనే సత్తా వారికి ఉంటుందని చెప్పారు. అనంతరం విద్యార్థునులకు బెల్ట్ పరీక్షలు నిర్వహించగా.. 100 మంది విద్యార్థినులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన 75 మంది విద్యార్థినులకు బెల్టులు, ధ్రువపత్రాలు అందజేసి వారిని అభినందించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాదేక, విజయలక్ష్మి, అరుణ, గౌస్, కృష్ణ, అనిల్, రాములు, నగేష్, మురళీ, నవీన్, రాములు, రాజు, సుప్రియ, భానుప్రియ, మాధవి, లావణ్య స్పందన, శృతి, వర్షిత, వెన్నెల, నాగేశ్వరి, మహేష్‌గౌడ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఆకు రాల్చే చెట్లతోనే తరచూ మంటలు

- ఎక్కడ మంటలంటుకున్నా శాటిలైట్ ద్వారా వెంటనే సమాచారం
- హుటాహుటిన వెళ్లి ఆర్పేస్తున్న అటవీశాఖ అధికారులు



నర్సాపూర్ రేంజ్ పరిధిలో అంటుకున్న మంటలను ఆర్పేస్తున్న సిబ్బంది(ఫైల్)

నర్సాపూర్, ఏప్రిల్ 13: మెదక్ జిల్లాలో అటవీ ప్రాంతం విస్తరించి ఉన్నది. ఇందులో ఆకురాల్చే చెట్లు ఉండడం వల్ల తరచూ మంటలు అంటుకుంటు న్నాయి. అయితే ఆ మంటలు మరింత విస్తరించ కుండా జిల్లా అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మెదక్ జిల్లాలో 5,76,27 హెక్టార్ల మేర అంటే 1.44 లక్షల ఎకరాల అటవీ ప్రాంతం విస్త రించి ఉన్నది. జిల్లాలో మెదక్, నర్సాపూర్, రామాయం పేట, కౌడిపల్లి, పెద్దశంకరంపేట, తూప్రాన్ కలిపి ఆరు రేంజ్‌లు, 266 కంపార్టుమెంట్లు, 91 బీట్లు, 26 సెక్షన్లు ఉన్నాయి. జిల్లాలోని అటవీ ప్రాంతంలో వేస విలో ఆకు రాల్చే చెట్లు ఎక్కువగా ఉండడంతో మంటలు అంటుకుని విలువైన వృక్షాలు కాలిపోతు న్నాయి. వన్యప్రాణులు కూడా గాయపడుతున్నాయి. ప్రతీ వేసవిలో అటవీ ప్రాంతాన్ని రక్షించేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శాటిలైట్ ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా అటవీ ప్రాంతంలో మంట లంటుకుంటే వెంటనే ఆ సమాచారం రాష్ట్రస్థాయి నుంచి బీట్ అధికారి వరకు అందుతున్నది. వెంటనే మంటలు అంటుకున్న ప్రాంతానికి అటవీ సిబ్బంది, అధికారులు వెళ్లి మంటలను ఆర్పుతున్నారని డీఎఫ్‌వో 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు.

మంటలు రావడానికి కారణాలివే

వేసవిలో భూగర్భజలాలు తగ్గుతుండటంతో జిల్లా లోని అడవిలో ఉన్న చెట్ల ఆకులు రాలుతుంటాయి. ఆకులు పూర్తిగా ఎండిపోయి ఉండటంతో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్న సమయంలో అటవీ ప్రాంతంలో ఉండే రాళ్లు వేడెక్కి ఆకులకు తగలడం వల్ల మంటలు అంటుకుంటాయని డీఎఫ్‌వో రవిప్రసాద్ తెలిపారు. దీంతోపాటు పశువులు, మేకల కాపరులు బీడీలు, సిగ రేట్లు తాగి పడేయడం వల్ల మంటలు అంటుకుంటా యన్నారు. అదేవిధంగా అటవీ ప్రాంతం సమీపంలో ఉండే పొలాల్లో పంట కోసిన తర్వాత మంట పెట్టడం కూడా ప్రమాదానికి కారణమని చెప్పారు. అందువల్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు అటవీశాఖ ఆధ్వ ర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతు న్నామని డీఎఫ్‌వో వెల్లడించారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా అటవీశాఖ అధికారి రవిప్రసాద్

నర్సాపూర్, ఏప్రిల్ 13: వేసవిలో అగ్ని ప్రమాదాల వల్ల అపార నష్టం వాటిల్లే అవ కాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అటవీశాఖ అధికారి రవిప్ర సాద్ తెలిపారు. శనివారం నర్సాపూర్ అటవీ శాఖ రేంజ్ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను డీఎఫ్‌వో, ఎఫ్ఆర్‌వో అంబర్‌సింగ్ ఆవిష్కరించి మాట్లాడారు. అగ్ని ప్రమాదాల వల్ల ప్రాణనష్టంతో పాటు ఆస్తి నష్టం జరిగే అవకాశమున్నందున అగ్ని ప్రమాదాలు సంభవించే చోట ఏ మాత్రం నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే అగ్నిమాపక సిబ్బందికి, లేదా 101కి ఫోన్‌చేసి సమాచారమిస్తే వెంటనే వచ్చి మంటలు ఆర్పుతారన్నారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారి భాలేష్, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలోనే దేశంలో ప్రగతి పరుగులు

- మోదీ ప్రోత్సాహంతోనే తెలంగాణలో వెలుగులు
- బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



సదాశివపేటలోని గాంధీచౌక్ వద్ద రోడ్‌షోలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

సదాశివపేట, ఏప్రిల్ 13: మోదీ పాలనలోనే దేశంలో ప్రగతి పరు గులు పెడుతున్నదని, మోదీ ప్రోత్సాహంతోనే తెలంగాణలో అభి వృద్ధి, సంక్షేమ వెలుగులు నిండాయని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. శనివారం సదాశివపేట పట్టణంలో రఘునందన్‌రావు బీజేపీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వ హించారు. ఈ సందర్భంగా గాంధీచౌక్ వద్ద రోడ్‌షోలో రఘునందన్ రావు మాట్లాడారు. పదేళ్లలో కేంద్ర ప్రభుత్వ పథకాలు, మౌలిక వస తుల నిర్మాణం, నగదు బదిలీల ద్వారా మోదీ ప్రభుత్వం తెలంగా ణకు రూ.10 లక్షల కోట్లు పంపిణీ చేసిందన్నారు. అయోధ్య రామజ న్మభూమిలో భవ్య రామమందిర నిర్మాణంతో 500ఏళ్ల హిందువుల కల సాకారం చేసిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిపించి ఆశీర్వదించాలని రఘునందన్‌రావు ప్రజ లను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, రాష్ట్ర నాయకులు నెమలికొండ హరీష్, ఓదెల మాణిక్ రావు, కోవూరి సంగమేశ్వర్, తోట చంద్రశేఖర్, కోదూరి శ్రీకాంత్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలి

పటాన్‌చెరు, ఏప్రిల్ 13: అవినీతిలో కూరుకుపోయిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులకు ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణ పాఠం చెప్పాలని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి ఎం.రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. శనివారం బీరంగూడలో కొనసాగిన భారీ రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ ప్రభంజనం కొనసాగుతోం దన్నారు. అన్నివర్గాల ప్రజలు మోదీ నాయకత్వాన్ని మరో బలపరి చేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు అనేక అగచాట్లకు గురయ్యారన్నారు. కేంద్రం ఇచ్చిన నిధు లను దుర్వినియోగం చేసి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడి జేబులు నింపుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌ను గెలి పిస్తే రాష్ట్ర ప్రజల పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టు అయ్యిం దన్నారు. దొంగలు పోయి గజదొంగలు వచ్చిన చందాన రాష్ట్రాన్ని దోచి సరిహద్దులు దాటిస్తున్నారని చెప్పారు. ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంత రూపురేఖలను సమూలంగా మార్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. రోడ్‌షోలో జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్, ఆదెల్లి రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

- టీఎస్ఎంసీ మెంబర్ డా.ఆనంద్



డా.ఆనంద్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 13: ప్రైవేటు ఆస్పత్రుల యాజ మాన్యాలు నిబంధనలు పాటించాలని లేకపోతే చర్యలు తప్ప వని తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ మెంబర్(టీఎస్ఎంసీ), యూరాలజిస్టు డా.ఎస్.ఆనంద్ హెచ్చరించారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ జిల్లాలో కొందరు డాక్టర్లు ఎలాంటి అర్హతలు లేకున్నా.. వాళ్ల పరిధి దాటి మెడికల్ సిస్టంను చేతుల్లో తీసుకుని చికిత్స చేస్తున్నారని, ఇది నిబంధన లకు విరుద్ధమన్నారు. రెఫరల్ అమౌంట్ కోసం కొందరు డాక్టర్లు కార్పొరేట్ ఆస్పత్రులకు రెఫర్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. అంబులెన్స్ డ్రైవర్లు కూడా రెఫరల్ అమౌంట్ కోసం ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి కార్పొరేట్ ఆస్పత్రులకు కేసులను తీసుకెళ్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, అన్‌క్వాలిఫైడ్ కలిగిన వారు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు పెట్టి మాడ్రన్ మెడిసిన్ నిర్దేశిం చినా చట్టరీత్యా నేరమని చెప్పారు. ఇందుకు సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా కూడా విధించవచ్చన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు నిబంధనలు పాటించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ టీఎస్ఎంసీ తరఫున త్వరలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ద్వారా కలెక్టర్, ఎస్పీ, డీఎంహెచ్‌వోలను కలవను న్నట్లు డా.ఆనంద్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

కుకునూరుపల్లి, ఏప్రిల్ 13: అప్పులు తెచ్చి సాగు చేయగా పంటల దిగుబడి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన పాల రమేష్‌గౌడ్(30) వ్యవసాయం, కొత్త ఇంటి నిర్మాణం కోసం బ్యాంకులోను, తెలిసిన వారి దగ్గర అప్పులు చేశాడు. అయితే పంటలు సరిగ్గా పండకపోవడం, రోజూవారి కూలికి వెళ్తున్నా అప్పులు తీరే మార్గం కనిపించకపోవడంతో జీవితంపై విరక్తితో గత ఆదివారం పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు.. గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి చనిపోయాడు.

పోలీసుల తనిఖీల్లో రూ.7.15 లక్షలు పట్టివేత

పెద్దశంకరంపేట/మనోహరాబాద్, ఏప్రిల్ 13: పెద్దశంకరంపేట మండల పరిధి లోని కోలపల్లి వద్ద 161వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద అల్లా దుర్గం సీఐ రేణుకారెడ్డి, పేట ఎస్ శంకర్ శనివారం వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర, నాందేడ్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న పులిచెర్ల వీరయ్య వాహనంలో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.4.50 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. మనోహరాబాద్ మండల కేంద్రంలోని కాళ్లకల్ చెక్‌పోస్టు వద్ద రూ.2.65 లక్షలను పోలీసులు శనివారం పట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి తూప్రాన్ వైపు వెళ్తున్న బాషానబ్ జానా వద్ద రూ.65 వేలు, హరినాథ్‌చారి వద్ద రూ.లక్ష, సాగర్ సూర్యవంశీ వద్ద రూ.లక్ష, మొత్తం రూ.2.65 లక్షలను స్వాధీనం చేసు కుని సిద్దిపేట డీటీవో ఆఫీస్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రతీ మహిళ సమాజాన్ని నడిపించే శక్తిగా ఎదగాలి

- రాష్ట్ర ఎమర్జింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్ లంక రమాదేవి



మాట్లాడుతున్న రమాదేవి

కొండపాక, ఏప్రిల్ 13 : ప్రతీ మహిళ సమాజాన్ని నడిపించే శక్తిగా ఎదగాలని రాష్ట్ర ఎమర్జింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్ లంక రమా దేవి అన్నారు. శనివారం కొండపాకలో ఉన్న సత్యసాయి ప్రశాంతి నికేతనం మహిళా జూనియర్ కళాశాలను ఆమె సందర్శించారు. కళాశాలను కలియ తిరుగుతూ త్వరలో ప్రారంభంకాబోతున్న యూనివర్సిటీ బిల్డింగ్‌ను పరిశీలించిన అనంతరం విద్యార్థినులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడ మహిళలు గౌరవించబడతారో అక్కడ అభివృద్ధి జరుగుతుందన్నారు. సద్గురు మధుసూదనా సాయివారి నిర్వహణలో తెలంగాణలో మహి ళల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడం, వారికి ఉచితంగా చదువుతోపాటు, వసతి ఏర్పాటు చేయడం, ఆర్థికంగా వారు నిలదొ క్కుకునే విధంగా చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. జూనియర్ కళాశాల స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు కళాశాల ఎదిగేందుకు సద్గురు మధుసూదనా సాయి ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. ప్రస్తుతం అంతరించిపో తున్న సనాతన సంప్రదాయాలను, విలువలతో కూడిన విద్యను ఈ కళాశాలలో అందించడం గొప్ప విషయమన్నారు. సద్గురు మధుసూ దనా సాయి కర్ణాటక, తమిళనాడు, తెలంగాణలో 28 క్యాంపస్‌లు ఏర్పాటు చేసి, 6000 మంది విద్యార్థులకు ఉచితంగా విద్యనందించ డమే కాకుండా, ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా ఉచిత మెడికల్ కళాశాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళా శాల చైర్‌పర్సన్ పూర్ణిమశంకర్, డైరెక్టర్ రమాదేవిని సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ చైర్‌పర్సన్లు రేష్మ, జయశ్రీ, మానస, ఇంటర్న్ స్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

హైటెన్షన్ విద్యుత్ స్తంభం ఎక్కిన యువకుడు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 13: పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రావడం లేదని ఓ యువకుడు 33/11 కేవీ హైటెన్షన్ విద్యుత్ స్తంభం ఎక్కాడు. ఈ ఘటన మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో చోటు చేసుకున్నది. కొల్చారం మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లితండాకు చెందిన దేవీసింగ్ కొన్నాళ్లుగా కుటుంబ సమస్యలు ఎదుర్కొం టున్నాడు గతంలో భార్య పుట్టింటికి వెళ్లి రాలేదు. దేవీసింగ్ తన సమస్యను విన్నవిం చుకోవడానికి శనివారం మెదక్ రూరల్ సీఐ కార్యాలయానికి వచ్చాడు. మళ్లీ తనకు న్యాయం జరగదనే మనస్తాపంతో పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న 33/11 కేవీ హైటెన్షన్ విద్యుత్ స్తంభం ఎక్కి కూర్చునే క్రమంలో షాక్ తగిలి కాలుకు గాయమైంది. విషయం తెలుసుకున్న సీఐ కేశవులు ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను వారం లోగా పరిష్కరిస్తానంటూ నచ్చజెప్పడంతో దేవీసింగ్ కిందకు దిగాడు.

దాబాపై పోలీసుల దాడి

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 13: ప్రభుత్వ అనుమతులు లేకుండా మద్యం అక్రమంగా విక్రయిస్తున్న సిద్దిపేట రూరల్ మండల పరిధి రాంచంద్రనగర్ సమీపంలోని దాబాపై సిద్దిపేట రూరల్ పోలీసులు శనివారం రాత్రి దాడిచే శారు. దాబా నిర్వాహకులు మల్లగౌడ్‌తో పాటు మద్యం సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. మద్యం ప్రియులకు నోటీసులు జారీచేసి వదిలి పెట్టగా, దాబా నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అపూర్వరెడ్డి తెలిపారు.

మెదక్ లోక్‌సభ పోరులో జై భారత్ నేషనల్ పార్టీ

- అవినీతి రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం
- ఆ పార్టీ నేత శోభన్‌బాబు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 13: మెదక్ లోకసభ స్థానంలో జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ నాయకుడు శోభన్‌బాబు తెలిపారు. శనివారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ నేతృత్వంలో జై భారత్ నేషనల్ పార్టీ తెలంగాణలోని మూడు లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయిం చిందన్నారు. పార్టీ అధినేత నిర్ణయం మేరకు మెదక్ ఎంపీ స్థానం నుంచి తాను బరిలో దిగుతున్నట్లు తెలిపారు. అవినీతిరహిత, ఆర్థిక అసమానతలు లేని సమాజ నిర్మాణమే పార్టీ లక్ష్యమన్నారు. అన్ని రాజకీయ పార్టీలు యువతను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నా యని మండిపడ్డారు. ఏ ఒక్క పార్టీ యువత భవిష్యత్ కోసం ఆలో చించడం లేదని దుయ్యబట్టారు. ప్రజలు తనను ఆదరించి గెలిపిస్తే.. ప్రతి మండలానికి ఒక గ్లోబల్ స్టాండర్డ్ లైబ్రరీ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయిస్తానని ఆయన వెల్లడించారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో బూత్‌స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు పార్టీ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు సాయి, వీరబాబు పాల్గొన్నారు.



ఇటీవల చుంచనకోట శివారులో పేకాట స్థావరంలో పట్టుబడిన కాయిన్స్, నగదు

కాయ్ రాజా.. కాయ్..

- చేర్యాలలో పేకాట జోరు
- టాస్క్‌ఫోర్స్ పోలీసులకే చిక్కుతున్న వైనం

చేర్యాల, ఏప్రిల్ 13: చేర్యాల ప్రాంతంలో గుట్టుచ ప్పుడు కాకుండా పేకాట జోరుగా కొనసాగుతున్నది. సరదాగా మొదలై ఆ తరువాత బానిసలుగా మార్చుతూ ఎంతోమంది జేబులను గుల్లచేస్తున్నది. మారుమూల పల్లెల్లో సైతం రోజురోజుకూ పేకాట విష సంస్కృతి విస్తరిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. దీంతో పేకాట రాయుళ్లు తమ ఆటకు ఇబ్బందుల్లేని, కుటుంబసభ్యులు, పోలీసులకు అనుమానం రాని రహస్య ప్రదేశాలను ఎంచుకుంటున్నారు. పలువురి వ్యవసాయ క్షేత్రాలు, ఇళ్లు, క్లినిక్‌లు, దుకాణాలు స్థావ రాలుగా మారుతున్నాయి. వేలాది రూపాయలు పెట్టి ఆట కొనసాగిస్తుండటంతో మూడు రమ్మీలు.. ఆరు ముక్కలాట అన్న చందంగా సాగుతున్నది. గతంలో స్థానికులే పేకాట ఆడగా, ప్రస్తుతం హైదరాబాద్ తది తర పట్టణ ప్రాంతాలకు చెందిన పేకాట రాయుళ్లకు స్థావరం ఏర్పరచి ఆటాడిస్తున్నారు. అందుకు నిర్వాహ కులు స్థల యజమానికి ఊహించిన దానికి మించి డబ్బులు ఇస్తుండటంతో సకల ఏర్పాట్లు చేస్తున్నారు.

పోలీసుల నిఘా కరువు

పోలీసులు పటిష్ఠ నిఘా పెట్టకపోవడంతో కొంతకా లంగా టాస్క్‌ఫోర్స్ పోలీసుల చేతికి చిక్కుతుండటం, ఇందుకు చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు మండలాల్లో చోటుచేసుకున్న ఘటనలు నిదర్శనంగా నిలుస్తు న్నాయి. కొన్నాళ్ల క్రితం కొమురవెల్లి మండలం గౌరా యపల్లి శివారులో భారీగా పేకాట ఆడుతూ పట్టుబ డ్డారు. కొద్దిరోజుల క్రితం చేర్యాల పట్టణ శివారు కడవే రుగు శివారులో పలువురు బడా వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడినా గోప్యంగా ఉంచారు. ఇటీవల చేర్యాల మండలం చుంచనకోట గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద హైదరాబాద్‌కు చెందిన పలు వురికి స్థావరం ఏర్పరచడంతో రాత్రివేళ పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. మరికొందరు పరారయ్యారు. వారి నుంచి కొంతమేర నగదు, కాయిన్స్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే చేర్యాల పట్టణం కేపీఆర్ కాలనీ లోని ఓ క్లినిక్‌లోనూ పలువురిని పట్టుకున్నారు. తాజాగా చేర్యాల-మద్దూరు మండలాల శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రం శివారులో పలువురు పట్టుబడ్డారు. పటిష్ఠ నిఘాతో కొద్దిరోజులుగా ఎక్కడో ఓచోట పేకాట రాయుళ్లు పట్టుబడుతూనే ఉండటం, స్థానికంగా జరు గుతున్న పేకాట దందాకు నిదర్శనంగా నిలుస్తున్నది. పేకాట మరింత విస్తరించకుండా పోలీసులు ప్రత్యా మ్నాయ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సలాఖ్‌పూర్‌లో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

- 6 ఫోన్లు, రూ.70 వేల నగదు స్వాధీనం ● ఆరుగురిపై కేసు



పోలీసులు స్వాధీనం చేసుకున్న పేకలు, సెల్‌ఫోన్స్, నగదు

మద్దూరు, ఏప్రిల్ 13: మద్దూరు మండలం సలా ఖ్‌పూర్‌లో పేకాట స్థావరంపై సిద్దిపేట జిల్లా టాస్క్‌ ఫోర్స్, మద్దూరు పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి ఆరు ఫోన్లు, రూ.70 వేల నగదును స్వాధీనం చేసుకుని, ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. సలాఖ్‌పూర్ గ్రామ శివారులోని పశువుల కొట్టంలో శుక్రవారం రాత్రి కొంతమంది పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం రావడంతో దాడులు చేశా మన్నారు. బహిరంగ ప్రదేశాల్లో కానీ, ఇళ్లలో కానీ పేకాట ఆడితే సమాచారం అందించాలని కోరారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

వెల్దుర్తి, ఏప్రిల్ 13: పద్దెనిమిది ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సాంస్కృతిక సారథి కళాకారుల మెదక్ జిల్లా టీమ్ లీడర్ సిద్దు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద సాంస్కృతిక సారథి కళాకారులు ఆట, పాటలతో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలలో అర్హులందరూ తమ ఓటు హక్కును కచ్చితంగా వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిడులకు గురి కాకుండా స్వేచ్ఛగా ఓటేసి సరైన ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కళాకారులు రామరావు, ఎల్లం, దాసు, శేఖర్, విజయలక్ష్మి, మాధవి, కృష్ణ పాల్గొన్నారు.

మిల్లెట్ ప్రాసెస్ యూనిట్‌ను సందర్శించిన ఆర్గనైజర్లు



లింగాపూర్‌లోని మిల్లెట్‌ప్రాసెస్ యూనిట్‌లో ఆర్గనైజర్లు

నారాయణఖేడ్, ఏప్రిల్ 13: మండలపరిధిలోని లింగాపూర్ శివారులో రూర్బన్‌పథకం ద్వారా ఏర్పాటు చేసిన మిల్లెట్ ప్రాసెస్ యూనిట్‌ను శనివారం హైదరాబాద్, మెదక్ జిల్లా టేక్మాల్, వెల్దుర్తి మండలాలకు చెందిన ఫార్మర్ ప్రొడిసర్ ఆర్గనైజర్లు సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లెట్ ప్రాసెస్ యూనిట్‌ను మహిళలు చిరుధాన్యాలతో చేస్తున్న వంటకాలు, వాల్యూ ఆడెడ్ విధానంతో పాటు పంటల వైవిధ్య పద్ధతులపై అవగాహన కోసం దాదాపు వంద మంది వరకు ఫార్మర్ ప్రొడ్యూసర్స్ సందర్శించారు. వారికి మిల్లెట్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ వీరశెట్టి, ఐకేపీ ఏపీఎం టిక్యానాయక్‌లు ప్రాసెసింగ్ యూనిట్‌లో చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. మహిళా రైతులు చిరుధాన్యాలతో చేస్తున్న జొన్న రొట్టెలు, ఇతర ఆహార పదార్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో, సీఈవో మొగులయ్య, ఎఫ్‌పీవో చైర్మన్ రాంకిరణ్, చాందిని, శ్రీమతి చరిష్మ, డాక్టర్ సంగప్ప, డాక్టర్ శ్రీనివాసబాబు, డాక్టర్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

గోనె సంచులే లేవు.. ఇక తూకమెప్పుడో?

- హడావిడిగా వారం క్రితమే ప్రారంభమైన కొనుగోలు కేంద్రాలు
- నేటికీ ఒక్క బస్తా తూకం కాలేదు
- అకాల వర్షాలకు తడుస్తున్న ధాన్యం
- అరకొర దిగుబడిని అమ్ముకుందామన్నా రైతులకు తప్పని తిప్పలు



వరిగుంతంలో ధాన్యం రాశులను కవర్లతో కప్పిన రైతులు, మెదక్-జోగిపేట రహదారి పక్కన ధాన్యం

కొల్చారం, ఏప్రిల్ 2: మండలంలో యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారం రోజుల క్రితమే హడావిడిగా ప్రారంభించినా, ఇప్పటికీ ఒక్క ధాన్యం బస్తా కూడా తూకం వేయలేదు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ ఆయా కేంద్రాలకు గోనె సంచులే రాలేదు. మండల వ్యాప్తంగా సుమారు 19వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. బోరు బావుల కింద కొంత మేర వరిపంట ఎండినప్పటికీ ముందుగా సాగు చేసిన వరి పంట కోతలు పూర్తయ్యాయి. మండలంలో ఎనిమిది సొసైటీలతో పాటు ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను గత శనివారమే ప్రారంభించారు. వారం రోజులు గడిచినా ఇప్పటికీ ఒక్క బస్తా తూకం వేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గోనె సంచుల కోసం ఎదురుచూపులు తప్పడంలేదు. నిన్నటి నుంచి కురుస్తున్న అకాలవర్షాలకు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దవుతున్నది. రెండు రోజుల క్రితం వరకు నీరు లేక ఎండిపోయిన వరి పంటను హార్వెస్టర్లతో కోతలు కోసి కేంద్రాలకు తెచ్చి ఆరబెడితే తూకం కాక పోగా, అకాల వర్షాలకు తడిసిముద్దయ్యాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుబాటులో ఉన్న కవర్లతో వరిధాన్యం రాశులను తడవకుండా కప్పిపెట్టేందుకు రైతులు పడుతున్న ఇక్కట్లు అంతా ఇంతా కాదు. ఇప్పటికే వారం రోజులు గడిచి పోయాయి.. అకాలవర్షాలతో మరింత నష్టం జరగక ముందే అధికారులు స్పందించి ధాన్యం త్వరగా తూకమయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

అకాల వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



రంగంపేటలో రైతులతో మాట్లాడుతున్న డీఎం హరిక్రిష్ణ

కొల్చారం, ఏప్రిల్ 13: రానున్న రోజుల్లో అకాల వర్షాలు కురిసే పరిస్థితులు ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది, రైతులు అప్రమత్తంగా ఉండాలని సివిల్ సప్లయి డీఎం హరిక్రిష్ణ సూచించారు. మండలం రంగంపేట సొసైటీ ఆవరణలో శనివారం వరి ధాన్యం రాశులను పరిశీలించారు. ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పి తడవకుండా చూసుకోవాలని పలువురు రైతులకు ఫోన్ చేసి పిలిపించి చెప్పారు. నీటి తడులు సరిగా అందక ధాన్యం తాలు ఉన్నందున ప్యాడీక్లీనర్ల ద్వారా శుభ్రం చేయాలని రైతులకు సూచించారు. శుభ్రం చేస్తే బస్తాకు అరకిలో వరకు మాత్రమే పోతుందని, అదే శుభ్రం చేయకుంటే రైస్‌మిల్లర్లు రెండు నుంచి మూడు కిలోల తరుగు తీసుకోవడం ద్వారా మీకే కదా నష్టం జరుగుతుందని వివరించారు. ఆయన వెంట సొసైటీ సీఈవో నవీన్, సిబ్బంది బీరప్ప, సిద్దు, రైతులు ఉన్నారు.

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలి: సీఐ



రాజబోయిన రవి, జహీరాబాద్ సీఐ

జహీరాబాద్, ఏప్రిల్ 13: వాహనదారులు రోడ్డుభద్రత నియమాలను పాటించాలని జహీరాబాద్ పట్టణ సీఐ రాజబోయిన రవి పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వాహనదారుల నిర్లక్ష్యంవల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. జహీరాబాద్ పట్టణంలో ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలను పాటించాలన్నారు. వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్సు, వాహనానికి సంబంధించిన పత్రాలను దగ్గర పెట్టుకోవాలన్నారు. నెంబరుప్లేటు లేని వాహనాలన సీజ్ చేస్తామని, మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ద్విచక్ర వాహనాలకు పెద్దశబ్దం వచ్చేలా సైలెన్సర్లను ఏర్పాటుచేస్తే ఆటివాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. జహీరాబాద్ పరిధిలోని ధాబాలన్ని రాత్రి 11.30 లోపు మూసివేయాలని, లేకపోతే కఠిన చర్యలు తీకుంటామన్నారు. కాలనీల్లో ఎవరైన అనుమానస్పదంగా కనబడితే డయల్ 100 నెంబర్‌కు ఫోన్‌చేయాలని చెప్పారు. సైబర్ నేరాలపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రైస్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీ



కోనాపూర్ రైస్ మిల్లును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

రామాయంపేట, ఏప్రిల్ 13: రైతుల నుంచి సేకరించిన వరి ధాన్యాన్ని నూర్పిడి చేసిన బియ్యాన్ని రవాణాలో ఆలస్యం చేయరాదని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మిల్లర్లకు సూచించారు. శనివారం రామాయంపేట మండల పరిధిలోని కోనాపూర్, తదితర రైస్ మిల్లులను జిల్లా పౌరసరాల అధికారి బ్రహ్మారావుతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిల్వ ఉన్న వరి ధాన్యం రికార్డులను పరిశీలించారు. అనంతరం రైస్ మిల్లర్లతో సమీక్షించారు. సీజన్‌లో టార్గెట్ పూర్తి చేయాలని సూచించారు.

ధర్మారంలో నేటి నుంచి రామాలయ ప్రతిష్ఠాపనోత్సవాలు

రామాయంపేట, ఏప్రిల్ 13: మండలంలోని ధర్మారంలో రఘుపతి గుట్టపై నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం నుంచి ప్రతిష్ఠాపన మహోత్సవాలు అంగరంగా వైభవంగా నిర్వహించనున్నారు. వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం సీతారామ, లక్ష్మణుల విగ్రహాలను గ్రామంలోని వీధులగుండా ఊరేగించారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయి. ఈ నెల 15న విగ్రహాల ప్రతిష్ఠాపన జరుగుందన్నారు. 17న సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు.

బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడిగా అంజిరెడ్డి

గుమ్మడిదల, ఏప్రిల్ 13 : బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడిగా మండలంలోని రాంరెడ్డిబాయి గ్రామానికి చెందిన ఎస్ అంజిరెడి నియామకమయ్యారు. జిల్లా బీజేపీ కిసాన్‌మోర్చా అధ్యక్షుడు మల్లెపల్లి రాజేందర్ రెడ్డి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు అంజిరెడ్డి తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో బీజేపీ పార్టీ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడి పదవిలో నియమించినందుకు జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డికి, జిల్లా అధ్యక్షుడు మల్లెపల్లి రాజేందర్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

మోదీ విధానాలే బీజేపీ గెలుపునకు సోపానాలు



ఖేడ్‌లో పలువురికి కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ బీబీపాటిల్, బీజేపీ నేత గోదావరిఅంజిరెడ్డి

నారాయణఖేడ్, ఏప్రిల్ 13: ప్రధానిగా మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ విధానాలే బీజేపీ గెలుపునకు సోపానాలని జహీరాబాద్ ఎంపీ, పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి బీబీపాటిల్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నారాయణఖేడ్‌లోని బీజేపీ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన వంద మంది యువకులు వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేరడంతో వారు పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోచేర్చుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికారప్రతినిధి సంగప్ప, జిల్లా నాయకులు అరుణ్‌రాజ్, మహిళా నాయకురాలు వీరమణిరాథోడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **న్యాల్‌కల్:** న్యాల్‌కల్‌లో శనివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ పాల్గొని మాట్లాడారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా తన గెలుపు కోసం అందరం కష్టపడిచేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు దేశెట్టిపాటిల్, మల్లిఖార్జున్‌పాటిల్, బిజిలిపురం శ్రీకాంత్‌ముదిరాజ్, అరుణాకౌళాస్, న్యాయవాది పాండురంగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వివిధపార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు.

● **జహీరాబాద్:** బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా నాయకులు అరుణాకౌలాస్, బక్కయ్యగుప్తా పట్టణ బీజేపీ అధ్యక్షుడు విశ్వనాథ్, మహిళామోర్చా అధ్యక్షురాలు శోభ తదితరులు పేర్కొన్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని రాంనగర్, హౌజింగ్‌బోర్డు, టీచర్స్‌కాలనీ తదితర ప్రాంతాల్లో బీజేపీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం పార్టీకార్యాలయంలో బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని పార్టీ రాష్ట్ర నాయకుడు సుధీర్‌బండారీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు అప్పం శ్రవణ్, సంతోష్, కార్యకర్తలు, బీజేపీ అభిమానులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 13: పెద్దశంకరంపేట మండలపరిధిలోనిఆరేపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు శనివారం మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో పేట బీజేపీ కార్యాలయంలో పార్టీలో చేరారు. గ్రామాల్లో ఇంటింటికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తిరుగుతూ బీబీపాటిల్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆరేపల్లి గ్రామానికి చెందిన అనిల్‌రావు, పర్వయ్య, దేవయ్య లక్ష్మణ్, దత్తు, శివకుమార్, శ్రీకాంత్ తదితరులు బీజేపీలో చేరారు.

● **టేక్మాల్:** మండలంలోని పల్వంచ గ్రామానికి చెందిన పలువురు యువకులు శనివారం బీజేపీలో చేరగా, వారికి ఎంపీ బీబీ పాటిల్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు గ్రామ బీఆర్ఎస్ యువత అధ్యక్షుడు శంకర్, బేతయ్య ధనంజయ, జగదీశ్వర్, తలరి దుర్గయ్య, ఈశ్వర్ ఉన్నారు.

● **అల్లాదుర్గం:** మండలంలోని అప్పాజీపల్లి, చిల్వర్, గాండ్లబావి గిరిజన తండా నుంచి వివిధ పార్టీలకు చెందిన 50 మంది యువకులు శనివారం బీజేపీలో చేరారు. గాండ్లబావి గిరిజన తండాలో పార్టీ మండల అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి, మెదక్ జిల్లా నాయకులు కంచరి బ్రహ్మం, కాళ్ల రాములు మాట్లాడుతూ మోదీ నాయకత్వంలోనే దేశాభివృద్ధి సాధ్యమనే విశ్వాసంతో ఎంతో మంది బీజేపీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సాయిలుగౌడ్ పాల్గొన్నారు.

సంస్కారం అంటే కాళ్లు మొక్కడమేనా?



సమావేశంలో మాట్లాడుతున్న రాజిరెడ్డి

వెల్దుర్తి, ఏప్రిల్ 13: చదువుకున్న సంస్కారం నేర్పింది నాటి సీఎం కాళ్లు మొక్కడమేనా అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని ప్రశ్నించారు. శనివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.. ఉమ్మడి జిల్లాలో నువ్వు అధికారిగా పనిచేశావు తప్ప నీకు జిల్లాతో ఉన్న అనుబంధం ఏమిటి అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటికే ముఖ్యమైన హామీలను నెరవేర్చామని, ఎన్నికల తర్వాత త్వరలోనే అన్ని హామీలను నెరవేరుస్తామని రాజిరెడ్డి అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యర్థి ముదిరాజ్ ముద్దుబిడ్డ అయిన నీలం మధును కాంగ్రెస్‌పార్టీ పోటీకి నిలపడమే వచ్చే ఎన్నికల్లో విజయానికి నాంది అని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. కాగా శనివారం వెల్దుర్తిలోని శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామి, శివపార్వతుల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్‌పార్టీలో చేరికలు

కొల్చారం, ఏప్రిల్ 13: కొల్చారం మండలం చిన్నాఘన్‌పూర్, కిష్టాపూర్ గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి సమక్షంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులగారి మల్లేశంగౌడ్ ఆధ్వర్యంలో చేరారు. చేరినవారిలో కిష్టాపూర్ ఎస్సీ కాలనీవాసులు, అలాగే చిన్నాఘన్‌పూర్‌కు చెందిన మత్స్యశాఖ డైరెక్టర్ అమనబోయిన వెంకటేశం, ముదిరాజ్ సంఘం చైర్మన్ శంకరయ్యతో పాటు 20 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు.

● **శివ్వంపేట:** మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆవులరాజిరెడ్డి, నాయకులు నవీన్‌గుప్తా సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మండల కో ఆప్షన్ మాజీ సభ్యుడు దావుద్, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు స్వామిగౌడ్, బీఆర్ఎస్ కార్మిక సంఘం నాయకుడు నాగయ్య, మైనార్టీ నాయకుడు ఎత్తేశం, 30మంది కాంగ్రెస్‌లో చేరారు.

నీలం మధు గెలుపును ఎవరు ఆపలేరు: ఎంపీపీ

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 13: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు గెలుపును ఎవరు ఆపలేరని ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలు విసిగిపోయారన్నారు.

కొండా సురేఖ మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్టుంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 13: తరుచూ పార్టీలు మారే కొండా సురేఖ నన్ను విమర్శించడం దయ్యాలు వేదాలు వల్లించినట్టుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ధ్వజమెత్తారు. శనివారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే సునీతారెడ్డి స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నర్సాపూర్‌లో మంత్రి కొండాసురేఖ తనపై చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. వారి స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌ను వీడి వైసీపీ, బీఆర్ఎస్ పార్టీల్లో చేరిన కొండాసురేఖ దంపతులు తనను విమర్శించడం విడ్డూరమన్నారు. తనకు ఎటువంటి నోటీసులు, సంజాయిషీ కోరకుండానే పార్టీ సస్పెండ్ చేయడం వల్లే బీఆర్ఎస్‌లో చేరానే తప్ప పార్టీకి ద్రోహం చేయలేదన్నారు. తాను ఓడినా ఉమ్మడిజిల్లాలో పార్టీని కాపాడేందుకు ఎంతో కష్టపడ్డానన్నారు. నాపై విమర్శలు చేసేముందు ఆలోచించి విమర్శలు చేయాలన్నారు. కాగా మెదక్ బీఆర్ఎస్ పార్లమెంటు అభ్యర్థి వెంకట్రామారెడ్డి తన ఉమ్మడి కుటుంబంలో ఉన్న ఆస్తితో ప్రజాసేవ చేయడానికి సిద్ధమవుతుంటే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ నెల 16వ తేదీన మెదక్ ఉమ్మడి జిల్లాలో ఎన్నికల ప్రచారంలో భాగంగా చౌటకూర్‌లో నిర్వహించనున్న మాజీ సీఎం కేసీఆర్ సభకు నర్సాపూర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో తరలిరావాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్ నయిమోద్దిన్, నాయకులు సత్యంగౌడ్, శేకర్, సురారం నర్సింహులు, మహ్మద్, రింగులప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత



అల్లాదుర్గం: రాంపూర్‌లో శ్రీపెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న మాధవానంద సరస్వతి స్వామి

చిలప్‌చెడ్, ఏప్రిల్ 13: మండలం పరిధిలోని జగ్గంపేట గ్రామంలో శనివారం నల్ల పోచమ్మజాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు శనివారం నల్ల పోచమ్మకు బోనాలు సమర్పించారు. మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి అభిషేకం, పూజలు, ఒడిబియ్యాలు, బోనాలు, అగ్గి గుండాలు నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ ఇంటికి ఒక బోనం చొప్పున సుమారు 200మంది బోనాలు సమర్పించారు. బోనాల ఊరేగింపులో శివసత్తుల చిందులు పోతరాజుల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అగ్ని గుండాల్లో భక్తులు నడిచి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నల్ల పోచమ్మఉపత్సవ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు, గ్రామస్థులు ఉన్నారు.

సంగాయిపేటలో కుంకుమార్చన

కొల్చారం, ఏప్రిల్ 13: మండలంలోని సంగాయిపేటలో శ్రీ ముత్యాలమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం మంజీరానది నుంచి గంగాజలాన్ని తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి రంగంపేటలోని శ్రీమదనానంద ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కుంకుమార్చనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

మేడికుందలో బోనాలు

వట్‌పల్లి, ఏప్రిల్ 13: మండలంలోని మేడికుంద గ్రామంలోని బీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం పెద్దసంఖ్యలో భక్తులు బోనాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని స్వామి సమర్పించారు.



చిలప్‌చెడ్: నల్ల పోచమ్మకు బోనాలతో ఊరేగింపు

రాంపూర్‌లో పెద్దమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన

అల్లాదుర్గం, ఏప్రిల్ 13: మండలంలోని రాంపూర్ గ్రామంలో శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజాము నుంచే పురోహితులు శిలాంకోట ప్రవీణ్‌శర్మతో పాటు పలువురు పురోహితులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రీమదనానంద పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి చేతుల మీదుగా విగ్రహాలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉత్సవాలకు సమీప గ్రామాల భక్తులు భారీగా హాజరయ్యారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



దేవయ్య(ఫైల్)

కోహీర్ ఏప్రిల్ 13: సంగారెడ్డి జిల్లాల్లోని వేర్వేరు మండలాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. కోహీర్ మండల పరిధిలోని దిగ్వాల్ గ్రామ శివారులోని 65వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందారు. కోహీర్ ఎస్ఐ కృష్ణయ్య వివరాల ప్రకారం.. దిగ్వాల్ గ్రామానికి చెందిన డప్పు దేవయ్య (35) దిగ్వాల్ గ్రామ శివారులోని ప్రిన్స్ దాబా వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సబిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ పైనుంచి కింద పడి యువకుడు..



మృతి చెందిన సురేష్

కల్హేర్/సిర్గాపూర్, ఏప్రిల్ 13: సిర్గాపూర్ గ్రామ శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని గైర్హాన్ తండాకు చెందిన విస్లావత్ సురేష్(30) అనే యువకుడు మృతి చెందాడు. శనివారం సిర్గాపూర్ ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గైర్హాన్ తండాకు చెందిన సురేష్ కిరాణా సామగ్రి కోసం సిర్గాపూర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బైక్ అదుపు తప్పి రహదారిపై వేసిన మట్టి కుప్పపైకి దూసుకుపోవడంతో బైకుపై నుంచి పడి తీవ్రగాయాలై అక్కడక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకుని కార్మికుడి బలవన్మరణం

శివ్వంపేట, ఏప్రిల్ 13: మండలంలోని కొత్తపేట రూప్లాతండాలో ఇటుక బట్టీలో పని చేసే కార్మికుడు ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన బచ్చేంద్రో దరువ ఉపాధి కోసం జనవరిలో కుటుంబ సభ్యులతో కలసి వచ్చి రూప్లా తండాలోని ఓ ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. బచ్చేంద్రో చిన్న కొడుకు దీపక్ దరువ(21)కు మతిస్థిమితం సరిగా లేదు. ఈ నెల 12న ఇటుక బట్టీలో పని ముగించుకుని ఇంటికి వచ్చిన దీపక్ దరువ డబ్బుల విషయంలో తల్లితో గొడవపడ్డాడు. తండ్రి మందలించడంతో సాయంత్రం ఇంటినుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. తల్లిదండ్రులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించగా శనివారం ఇటుకబట్టీల సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని వేలాడుతూ దీపక్ దరువా మృతదేహం కనిపించింది. తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అక్రమంగా నిల్వచేసిన మద్యం పట్టివేత



సీజ్ చేసిన మద్యం బాటిళ్లతో ఎస్ఐ నవత

వెల్దుర్తి, ఏప్రిల్ 13: మండల పరిధిలోని రామాయిపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన 24.4 లీటర్ల మద్యంను పట్టుకున్నట్లు ఎస్ఐ నవత తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి శనివారం దాడి చేసి అక్రమంగా నిల్వచేసిన రూ. 14,780 విలువ గల మద్యాన్ని సీజ్ చేశామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

రెండు గ్రామాల్లో చోరీ

శివ్వంపేట, ఏప్రిల్ 13: మండలంలోని రెండు గ్రామాల్లో శుక్రవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చండి గ్రామంలోని చండికా ఆలయంలో శుక్రవారం రాత్రి అమ్మవారిపై ఉన్న 50తులాల వెండి కిరీటం, హుండీని అపహరించుకుపోయారు. అదేవిధంగా చిన్నగొట్టిముక్ల గ్రామంలో మధిరే నాగరాజ్ ఇంటికి వేసిన తాళాన్ని పగులగొట్టి ఇంట్లో ఉన్న రూ.5వేల నగదు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు.

జహీరాబాద్‌లో 130 వాహనాలు సీజ్



వాహనాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ, సీఐ తదితరులు

జహీరాబాద్, ఏప్రిల్ 13: పట్టణంలో శనివారం సాయంత్రం నిర్వహించిన వాహనాల తనఖీల్లో భాగంగా 130 వాహనాలను సీజ్ చేసినట్టు జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహనరెడ్డి తెలిపారు. శనివారం డీఎస్పీ మాట్లాడుతూ.. వాహనాల తనఖీల్లో భాగంగా వివిధరకాల వాహనాలకు సరైనపత్రాలు లేకపోవడం, రోడ్డుభద్రత నియమాలు పాటించకపోవడం తదితర కారణాలతో వాహనాలను సీజ్‌చేశామన్నారు. వాహనదారులు సంబంధిత పత్రాలను చూయించి వాహనాలను తీసుకపోవాలని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రవి, ఎస్ఐ లక్ష్మారెడ్డి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పాటుపడాలి

● టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

నర్సాపూర్, ఏప్రిల్ 13: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యాయులు కృషి చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్‌లోని ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద టీఎస్‌యూటీఎఫ్ 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బుచ్యానాయక్, నాయకులు రవి, డాకియా, కనకరాజు, రమేష్‌రాజు, గంగాధర్, అప్పలనాయుడు, కేవీఆర్‌నాయుడు, రవి, పెంటయ్య, రాజు, శంకర్‌చారి, సత్యనారాయణ, భాస్కర్‌కృష్ణరావు, రామినాయుడు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో ఘనంగా టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు

నారాయణఖేడ్, ఏప్రిల్ 13: టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నారాయణఖేడ్ సంఘం భవన కార్యాలయ నిర్మాణ స్థలం వద్ద సంఘం నాయకులు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాపురం అశోక్, ఉపాధక్షుడు కాశీనాథ్‌జాదవ్, కార్యదర్శులు ఏశప్ప, నర్సయ్య మదుపతి నరేష్, నాయకులు హరిసింగ్, రాజు, రాములు, శ్రీరాంనాయక్, అప్పారావు, సర్దార్, అంజయ్య, శివకుమార్, ఏసుదాసు, విఠల్, సిద్దయ్య, రవీందర్, సైమన్, నర్సింలు, రవి, శ్యాంరావు, విజయపాల్, తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో బీపీ మండల్ వర్ధంతి

తూప్రాన్, ఏప్రిల్ 13: బీసీ రిజర్వేషన్ల కోసం కృషి చేసిన బిందేశ్వరీ ప్రసాద్ మండల్ (బీపీ మండల్) వర్ధంతి కార్యక్రమాన్ని తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు గండి మల్లేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వర్గల్ జడ్పీటీసీ బాలుయాదవ్, తూప్రాన్ మండల అధ్యక్షుడు గడ్డి నర్సింహులు యాదవ్, లంబ రమేష్‌యాదవ్, రావెల్లి మాజీ సర్పంచు మల్లేశ్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ అంజయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హన్మంత్‌రావుపేటలో ఆకట్టుకున్న కుస్తీపోటీలు

నారాయణఖేడ్, ఏప్రిల్ 13: మండలపరిధిలోని హన్మంత్‌రావుపేటలో నిర్వహించిన శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం కుస్తీ పోటీలను నిర్వహించారు. పోటీల్లో స్థానిక మల్లయోధులతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతగా నిలిచిన మహారాష్ట్ర మల్లయోధుడు అభిజిత్‌కలిగావ్‌కు నిర్వాహకులు ఐదు తులాల వెండి కడియాన్ని బహూకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు దత్తు, ఆలయ కమిటీ చైర్మన్ అంతయ్య, మాజీ సర్పంచు రాములు, మాజీ ఎంపీటీసీ నారాయణ, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు డెస్కుల పంపిణీ

చేగుంట, ఏప్రిల్ 11: మండలంలోని వల్లబాపూర్ ప్రభుత్వ పాఠశాలకు సుప్రసన్న సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల సౌకర్యార్థం శనివారం డెస్కులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ డిప్యూటీ మేనేజర్ సత్య శీలన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. పాఠశాలకు సహకరించిన సంస్థ ప్రతినిధులను ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్‌రెడ్డి అభినందించారు.